క్లుప్తంగా

ఏయూ సందర్శన



స.హ.చట్టం కమిషనర్ శామ్యూల్ జొనాథన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రిజిస్ట్రార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ శామ్యూల్ జొనాథన్ బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబుతో కార్యాలయంలో సమావేశమయ్యారు. సమాచార హక్కు చట్టం అమలు, దరఖాస్తు చేసిన వారికి సమాచారాన్ని అందించే విధానాలపై అధికారులతో చర్చించారు. సమాచార హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడం, కోరిన సమాచారాన్ని నిర్దేశిత సమయానికి అందించాలని సిబ్బందికి సూచించారు.

కృష్ణా కళాశాల విద్యార్థినికి బంగారు పతకం



దుర్గాయమునను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: సాఫ్ట్‌బాల్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌లో మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా డిగ్రీ కళాశాల విద్యార్థిని డి.దుర్గాయమున మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో బీఎస్సీ సెకండియర్ స్టూడెంట్ దుర్గాయమునను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అభినందించారు. కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దుర్గాయమునకు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ టోర్నీ ప్రథమ స్థానంలో నిలిచిన దుర్గాయమున ఎందరో విద్యార్థినులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో క్రీడా విభాగాధిపతి డాక్టర్.వి.సంధ్యారాణి, డాక్టర్ శామ్యూల్ డేవిడ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



బ్యాగులు అందుకున్న శాంతి ఆశ్రమ విద్యార్థులతో క్లాడ్ బ్రిడ్జి సంస్థ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: క్లాడ్ బ్రిడ్జి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 19వ వార్డు శాంతి ఆశ్రమ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. సీఎస్సార్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా 100 మంది విద్యార్థులకు వీటిని అందజేసినట్లు సంస్థ సీఈవో అరుణ్ వెల్లంకి తెలిపారు. ఇక్కడి చెవిటి, మూగ విద్యార్థుల అభ్యున్నతిలో భాగం కావాలనే ఆకాంక్షతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. శాంతి ఆశ్రమ ప్రతినిధులు అందిస్తున్న సహకారం వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సాల్వ్ ఫర్ టుమారో'లో హమారా ల్యాబ్స్‌కు చోటు

బీచ్‌రోడ్డు: సామ్‌సంగ్ ఇండియా తన ఫ్లాగ్‌షిప్ సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 'సాల్వ్ ఫర్ టుమారో' 2024 పోటీల్లో టాప్ 20 టీమ్‌ల జాతీయ షార్ట్‌లిస్టును బుధవారం ప్రకటించింది. ఈ జాబితాలో నగరానికి చెందిన హమారా ల్యాబ్స్ బృందం చోటు సాధించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ఆలోచనలను 'కమ్యూనిటీ ఇన్‌క్లూజన్','పర్యావరణం– సుస్థిరత' అనే రెండు అంశాలపై సమర్పించారని సామ్‌సంగ్ సౌత్ వెస్ట్ ఏసియా కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్పీ చున్ తెలిపారు. దేశంలో స్టార్టప్ ఎకో సిస్టమ్‌ను పెంచే స్థానిక ప్రతిభావంతుల ప్రయాణాన్ని చూసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

మది నిండా జెండా



ఇసుకతోట కూడలిలో జాతీయ జెండాలు కొంటున్న పిల్లలు, పెద్దలు



రహదారిపై విక్రయిస్తున్న జాతీయ జెండాలు



తీరంలో త్రివర్ణ పతాకంతో యువతి

ఆరిలోవ: జెండా పండగ సందడి నగరంలో ఒకరోజే ముందే వచ్చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హర్ ఘర్ తిరంగా పిలుపు మేరకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాలు కట్టారు. ఇందులో భాగంగా తూర్పు నియోజకవర్గంలోని ఆరిలోవ, విశాలాక్షినగర్, ఎంవీపీ కాలనీ, ఇసుకతోట, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో జెండాలు రెపరెపలాడిస్తున్నారు. విమ్స్ ఆస్పత్రి, హెల్త్‌సిటీలోని ఆస్పత్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలను నిర్వాహకులు జాతీయ జెండాలు కట్టి సుందరంగా తీర్చిదిద్దారు. ప్రజలు ఇళ్లపై కట్టడానికి పెద్ద జెండాలు, పిల్లల సరదా కోసం పట్టుకొని పాఠశాలలకు వెళ్లడానికి చిన్న సైజు జెండాల విక్రయాలు రెండు రోజులుగా జోరుగా సాగుతున్నాయి. డెయిరీ ఫారం, హనుమంతవాక, ఇసుకతోట తదితర చోట్ల జాతీయ రహదారిపై బుధవారం వ్యాపారులు జెండాలు విక్రయించారు. ఈ విక్రయాలతో జాతీయ రహదారి సందడిగా మారింది.

జోరుగా జాతీయ జెండాల విక్రయాలు

మద్దిలపాలెం: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలనే నినాదంతో జాతీయ జెండాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇసుకతోట, వెంకోజీపాలెం, మద్దిలపాలెం ప్రాంతాల్లో ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేసి జెండాలు విక్రయిస్తున్నారు. రూ.100 నుంచి రూ.1,000 వరకూ వివిధ రకాల సైజుల్లో జెండాలు లభ్యమవుతున్నాయి. జాతీయ జెండాలతోపాటు కార్లలో పెట్టుకునేందుకు చిన్నసైజు స్లాండ్ జెండాలను, స్టిక్కర్లు విక్రయిస్తున్నారు. మరి కొందరూ హైవేపై సిగ్నల్ వద్ద వీటి విక్రయాలు చేస్తున్నారు. దుస్తుల దుకాణాల్లో త్రివర్ణ రంగులతో కూడిన ఫ్రాక్స్, డ్రెస్సులు అమ్ముతున్నారు. వీటిని స్వాతంత్య్ర దినోత్సవం రోజున చిన్నారులకు వేసి సందడి చేయడానికి చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. వీటి విక్రయాలు బాగానే సాగుతున్నాయని వస్త్ర వ్యాపారులు చెబుతున్నారు.

పిల్లల పార్కును వేగంగా నిర్మించండి

- ఇంజినీరింగ్ అధికారులతో జీవీఎంసీ కమిషనర్
- నత్తనడకన పనులు సాగడంపై ఆగ్రహం



ముడసర్లోవ వద్ద పిల్లల పార్కులో మ్యాప్ పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

ఆరిలోవ: పిల్లల పార్కు నిర్మాణంపై శ్రద్ధ చూపలేదని ఇంజినీరింగ్ అధికారులపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడసర్లోవ ప్రాంతం దీన్‌దయాల్‌పురం వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న పిల్లల పార్కును బుధవారం అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మ్యాప్‌ను పరిశీలించారు. ఏయే పనులు చేపడుతున్నారు, ఈ పనులు ఎప్పుడు ప్రారంభించారో తదితర విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. ఎనిమిది నెలల కిందట ప్రారంభమైన పార్కు పనులు నత్తనడకన సాగుతున్నట్లు గుర్తించిన కమిషనర్.. ఇంజినీరింగ్ అధికారులపై మండిపడ్డారు. ఎందుకు ఇంత నెమ్మదిగా జరుగుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు తొందరగా జరిపించకపోవడం వల్ల జీవీఎంసీపై ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. ఇప్పటి నుంచి వేగంగా పనులు నిర్వహించి పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పార్కులో పనులు చేపట్టడానికి ఆటంకంగా ఉన్న చెట్లు తొలగించి వేరే చోట(ట్రీ ట్రాన్స్‌లోకేషన్) నాటించాలన్నారు. పార్కులో ఓపెన్ ఎయిర్ థియేటర్లు, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట ప్రాంతం(మైదానం), 15 ఏళ్ల లోపు పిల్లలకు అవసరమైన అన్ని రకాల ఆట పరికరాలు అమర్చడంతోపాటు మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పర్యటనలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, జోన్–2 కమిషనర్ శైలజావల్లి, కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతిరాజ్, సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎస్.కిశోర్, ఏఈ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు విభాగంలో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య అప్పారావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆచార్య ఎలవర్తి విశ్వనాథ రెడ్డి సంపాదకత్వం వహించిన తెలుగు భాష సాహిత్యం, సంస్కృతులపై బౌద్ధ మత ప్రభావం పుస్తకావిష్కరణ సభ బుధవారం జరిగింది. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య మర్రిబోయిన జయదేవ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు శాఖాధిపతి అప్పారావు మాట్లాడుతూ అన్ని వర్గాలకు బౌద్ధమతం ఎలా దగ్గరైందో.. అలాగే తెలుగు శాఖ గొప్పతనాన్ని కూడా పుస్తకం ద్వారా తెలియజేశారన్నారు. విశ్రాంత ఆచార్యుడు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తన సంపాదకత్వం వహించిన పుస్తకాన్ని తాను పని చేసిన శాఖలోనే ఆవిష్కరించడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. ఆచార్య జయదేవ్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న అనేక మూఢ నమ్మకాలను నాటి కాలంలో బౌద్ధమతం దూరం చేసిందన్నారు. డాక్టర్ ఈశ్వరమ్మ పుస్తక సమీక్ష చేస్తూ వ్యక్తి పరిపూర్ణంగా మారడానికి బౌద్ధ మతం దోహదపడుతుందని పేర్కొన్నారు. డాక్టర్ సూర్యారావు మాట్లాడుతూ బౌద్ధ మతం ఆసియాకు మాత్రమే కాకుండా ప్రపంచానికి వెలుగునిచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్య, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ రత్నశేఖర్, డాక్టర్ సీతారత్నం, డాక్టర్ గిరీష్‌కుమార్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏయూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ ప్రాంగణాన్ని బుధవారం సాయంత్రం రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు పరిశీలించారు. మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు తగిన సూచనలిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్, యూనివర్సిటీ ఇంజినీర్ తిరుపతిరావు, బ్యూటిఫికేషన్ డీన్ ఆచార్య ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి పేరు కొనసాగించాలి

ఎంవీపీకాలనీ: తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి పేరు కొనసాగించాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. ఎంవీపీ కాలనీలోని ఓ హోటల్‌లో సంఘ సభ్యులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉత్తరాంధ్ర స్థానిక నాయకుల ప్రతిపాదనతో స్వాతంత్య్ర సమరయోధుడు, సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం నిరంతరం పోరాడిన గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరును తాటిపూడి రిజర్వాయర్‌కు పెట్టిందన్నారు. ప్రస్తుతం ఆయన పేరును తొలగిస్తూ కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయడాన్ని గోవిందరావు తప్పుబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. బీసీ సామాజిక వర్గానికి జాతీయ స్థాయిలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. దేశంలో అత్యధిక జనాభాగా బీసీలు ఉన్నప్పటికీ వారికి ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో తగిన భాగస్వామ్యం లభించడం లేదన్నారు. ఉత్తరాంధ్ర బీసీ నాయకులకు, వెలమ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు అన్నింటా సముచిత స్థానం కల్పించాలని కోరారు. బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలను రెట్టింపు చేయాలని, వెలమ రైతులకు, బీసీ కుల వృత్తులకు వంద శాతం సబ్సిడీతో రుణాలు కల్పించాని, రాష్ట్రంలో త్వరలో భర్తీ చేయబోయే నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు పూర్తిస్థాయి ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గంగ మన్మథరావు, పెదిరెడ్ల సత్యం, పెదిరెడ్ల ఈశ్వరరావు, ఇత్తంశెట్టి రామనాయుడు, శివకుమార్, గొల్లు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరంలో 'ఫ్రీడం ఫర్ గర్ల్ చైల్డ్'



మహిళా జాతీయ సమరయోధుల చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

బీచ్ రోడ్డు: బాలికలపై లైంగిక వేధింపులు ఆపండి.. ఆడపిల్లలకు స్వేచ్ఛ ఇవ్వండి అంటూ విద్యార్థులు నినాదించారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఈ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో బుధవారం బీచ్ రోడ్డులో ఫ్రీడం ఫర్ గర్ల్ చైల్డ్ పేరుతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 200 అడుగుల భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తూ మహిళా స్వాతంత్య్ర సమరయోధులు, జాతీయ మహిళా నాయకుల గురించి వివరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఇన్‌స్టిట్యూషన్ సీఈవో ఆదినారాయణ మాట్లాడుతూ పిల్లలపై తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయులు వ్యవహరించే పద్ధతుల్లో మార్పులు రావాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. బాలికలతో గౌరవ ప్రదంగా సంభాషించడం, మంచిగా ప్రవర్తించడం చిన్ననాటి నుంచి పిల్లలకు నేర్పించాలన్నారు. మహిళా సాతంత్య్ర సమరయోధుల ఫొటోలను గుర్తించి వారి పేర్లు చెప్పిన వారికి బహుమతులు అందజేశామన్నారు. 400 మంది విద్యార్థులు పాల్గొని సందర్శకులకు అవగాహన కల్పించారని చెప్పారు.

వెలమ సంఘానికి స్థలం కేటాయించండి



మంత్రి సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెలమ సంక్షేమ సంఘం సభ్యులు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో 50 లక్షల జనాభా కలిగిన వెలమ సామాజిక వర్గానికి విశాఖలో రెండు ఎకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌ను వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. నగరానికి వచ్చిన మంత్రిని బుధవారం ఒక హోటల్ కలిసి వినతిపత్రం అందజేశారు. అనేక సామాజిక వర్గాలకు, వివిధ సంస్థలకు, స్వచ్ఛంద సంస్థలకు విశాఖలో స్థలాలు కేటాయించాలరని, వెలమ సంక్షేమ సంఘానికి కూడా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్డ సత్యం, వైస్ ప్రెసిడెంట్ వరుదు రాజ్‌కుమార్, విశాఖ ఇన్‌చార్జి రెడ్డి ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మెగా ఫ్రీడమ్ క్విజ్ పోటీలు



విజేతలకు ట్రోఫీలు, చెక్కులు అందజేసిన కమిషనర్ శామ్యూల్ జొనాథన్

విశాఖ సిటీ: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించిన మెగా ఫ్రీడమ్ క్విజ్ పోటీలు బుధవారంతో ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు విద్యా సంస్థల నుంచి 5,005 మంది విద్యార్థులతో 1001 టీమ్‌లు పోటీపడ్డాయి. ఇందులో ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన చాణక్య టీం ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో గుంటూరుకు చెందిన అనూ క్యాంపస్(సర్దార్ పటేల్ టీమ్), తృతీయ స్థానంలో స్పేసెస్ డిగ్రీ కాలేజ్(దేవి టీమ్), నాలుగు, అయిదు స్థానాల్లో ఏవీఎన్ కాలేజ్(జెన్–జి టీమ్), ఏయూ అంబేడ్కర్ లా కాలేజ్(లా టీమ్) నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ పి.శామ్యూల్ జొనాథన్.. అంబేడ్కర్ ఆశయాలు విద్యార్థులకు ఆదర్శమయ్యేలా ఏయూలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ చేస్తున్న కృషిని అభినందించారు. సోషల్ రిఫార్మ్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పొలిటికల్ సైన్స్ విభాగం నుంచి డాక్టర్ జి.వీరరాజు అంబేడ్కర్ భావజాలాన్ని వివరించారు. అలాగే ప్రత్యేక అతిథిగా పాల్గొన్న సీనియర్ ఆడిట్ ఆఫీసర్ వరప్రసాద్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థలను ఏకతాటిపైకి తీసుకువచ్చి భారీ స్థాయిలో పోటీలు నిర్వహించిన అంబేడ్కర్ చైర్‌ను ప్రశంసించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. వీరితో పాటు 10 స్కూళ్ల నుంచి 10 టీమ్‌లకు కన్సొలేషన్ ట్రోఫీలు అందించారు. అలాగే అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ విన్నర్స్‌కు రూ.25 వేలు, రన్నర్స్‌కు రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేలు చెక్కులు అందజేశారు. ఈ పోటీలు విజయవంతానికి కృషి చేసిన అంబేడ్కర్ చైర్ డాక్టోరల్ ఫెలోస్ రాజ్‌కుమార్, ప్రవీణ్‌లకు జ్ఞాపికలు ఇచ్చారు.

స్వాతంత్య్ర యోధుల పోరాటం యువతకు స్ఫూర్తి



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఏయూ విద్యా విభాగాధిపతి షారోన్‌రాజు తదితరులు

విశాఖ సిటీ: స్వాతంత్య్ర సమరయోధుల స్ఫూర్తిని నేటి యువత స్వీకరించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు పిలుపునిచ్చారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా బుధవారం ఏయూ విద్యా విభాగంలో విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జీవితాలు, స్వాతంత్య్ర యోధుల పోరాటం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. భావి భారతావనికి అవసరమైన దేశభక్తి కలిగిన యువతను తయారు చేసే దిశగా ఇటువంటి కార్యక్రమాలను విభాగంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వాతంత్య్ర పోరాట ఘట్టాలను వివరించారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల జీవిత చరిత్రలను చదవాలని సూచించారు. కార్యక్రమంలో బీవోఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగరాజా కుమారి, డాక్టర్ ఎం.వి.ఎస్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణాదేవి, డాక్టర్ సాల్మన్ రాజు, డాక్టర్ మూర్తి, డాక్టర్ ఎస్.హేమలత, డాక్టర్ వెన్నెల కుమారి, విభాగ ఆచార్యులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ



గోదాంకు వేసిన సీలు పరిశీలిస్తున్న కలెక్టర్

ఆరిలోవ: డెయిరీఫారం వద్ద ఉన్న ఈవీఎం గోదాంను బుధవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తనిఖీ చేశారు. గత నెలలో తనిఖీ చేసిన అనంతరం గోదాంకు వేయించిన సీల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాం లోపల, బయట సీసీ కెమెరాల పని తీరును తనిఖీ చేశారు. ఇక్కడ పూర్తి స్థాయిలో భద్రత ప్రమాణాలు పాటించాలని.. నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల విభాగం, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

ఉత్సాహంగా పంద్రాగస్టు క్రీడా పోటీలు



ఖోఖో పోటీలో పాఠశాల విద్యార్థినులు



క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఆడుతున్న విద్యార్థులు

మద్దిలపాలెం: స్వాతంత్య్ర దిన వేడుకల్లో భాగంగా పాఠశాల స్థాయి విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. మద్దిలపాలెం పరిసర ప్రాంతంలోని ఏయూ క్రీడా మైదానంలో వారం రోజులుగా జరిగిన ఈ పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకవైపు విద్యార్థులు పోటాపోటీగా ఆడుతుంటే.. తోటి విద్యార్థులు వాటిని చూస్తూ కేరింతలు కొట్టారు. బుధవారం నిర్వహించిన క్రికెట్, ఖోఖో పోటీల ఫైనల్స్‌లో విద్యార్థులు రసవత్తరంగా ఆడారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి ఆనందం అంబరాన్నంటింది.

ఇంటి ముందు నిలిపిన కారు మాయం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంటి ముందు నిలిపిన కారు మాయమైంది. ఇంతవరకు బైక్‌లు, సైకిళ్లు ఎత్తుకుపోయిన దొంగలు ఇప్పుడు కార్లపై కన్నేశారు. ఆరిలోవ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. స్థానికుల ద్వారా తెలిసిన వివరాలిలా.. జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ వెటర్నరీ లేఅవుట్‌లో ఓ వ్యక్తి తన ఇంటి ముందు సోమవారం సాయంత్రం కారు పార్కింగ్ చేశాడు. మంగళవారం ఉదయం చూసేసరికి తన కారు కనిపించకపోవడంతో నిర్ఘాంతపోయాడు. ఎవరైనా ఎత్తుకెళ్లి ఎక్కడైనా విడిచి పెట్టేరేమోనని చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికాడు. ఎక్కడా కారు ఆచూకీ కానరాకపోవడంతో మంగళవారం రాత్రి ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లేఅవుట్‌లో కొందరు ఇళ్ల ముందు ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు ఆ కారును ఎత్తుకుపోయినట్లు ఓ సీసీ ఫుటేజీలలో వెల్లడైంది. కానీ వారు ఆ కారును ఎటుగా తీసుకువెళ్లారో అనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

కుమ్మేసిన వాన



చెరువును తలపిస్తున్న పిఠాపురం కాలనీ రోడ్డు

మద్దిలపాలెం: సుమారు గంట పాటు బుధవారం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి మద్దిలపాలెం తడిసి ముద్దయింది. వాహనాలను ఎక్కడికక్కడ కాసేపు నిలిపివేశారు. వర్షం తీవ్రతకు రోడ్డు సైతం కనిపించకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లు చెరువులను తలపించాయి. ఇసుకతోట, మద్దిపాలెం, కేఆర్ఎం కాలనీ, శివాజీపాలెం రోడ్డు, పిఠాపురం కాలనీ సర్వీసు రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి. కాసేపు జన జీవనం స్తంభించింది.

ట్రైనీ డాక్టర్ మృతికి ఐఎంఏ సంతాపం



కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలుపుతున్న వైద్యులు

ఎంవీపీకాలనీ: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో చోటుచేసుకున్న విషాద ఘటనపై భారత వైద్య సంఘం(ఐఎంఏ) సంతాపం తెలిపింది. ఐఎంఏ ఆధ్వర్యంలో బుధవారం మెడికవర్ ఆస్పత్రిలో సంతాప సభ నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి సంతాపం వ్యక్తం చేశారు. కోల్‌కతాలో పీజీ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య దేశ వ్యాప్తంగా విషాదాన్ని నింపిందన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పి.జె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయస్థానాలు ఇలాంటి హింసాత్మక ఘటనలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వ చర్యల కోసం వైద్యులంతా ఏకతాటిపైకి రావాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ బాపారావు, పెద్ద ఎత్తున వైద్యులు పాల్గొన్నారు.

ఇంట్లోకి చొరబడిన వ్యక్తిపై కేసు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు హనుమంతవాకలో ఓ వ్యక్తి మరొకరి ఇంట్లోకి చొరబడి వస్తువులు నాశనం చేశాడు. అతడిపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. బాధితులు తెలిపిన వివరాలిలా.. హనుమంతవాక విజయదుర్గా కాలనీలో రౌతు మేరికృపారాణి కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. బుధవారం ఆమె భర్త లేని సమయంలో రాత్రి 8 గంటలకు అదే ప్రాంతానికి చెందిన బాణాల రాము ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమెతోపాటు ఆమె తల్లి, కుమారుడిపై కుక్కర్‌తో దాడి చేశాడు. భయంతో వారంతా ఇంటి వెనుక ద్వారం నుంచి బయటకు పరుగులు తీశారు. ఇంట్లో ఉన్న టీవీ, కంప్యూటర్ మోనిటర్, డ్రెస్సింగ్ టేబుల్, ఐ ఫోన్, బీరువా తదితర విలువైన వస్తువులను ధ్వంసం చేసి రాము పారిపోయాడు. కొంతసేపటికి ఇంటికి చేరుకున్న కృపారాణి భర్తకు విషయం తెలియడంతో వెంటనే 100కు డయల్ చేశారు. ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కృపారాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.